# ప్రగతి పథంలో సహకార సంఘం

- రైతులకు అండగా 'కుభీర్' పీఏసీఎస్
- పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో రూ.26 లక్షల ఆదాయం
- 210 మందికి రూ.3 కోట్ల 75 లక్షల రుణాల అందజేత



కుభీర్‌లోని వ్యవసాయ సహకార సంఘం

కుభీర్, అక్టోబర్ 21 : కుభీర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లాభాల బాటలో సాగుతూ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. 48 గ్రామాల నుంచి 4100 మంది సభ్యులు ఉన్నారు. కాగా సుమారు 3 వేలకు పైగా రైతులకు వ్యవసాయ రుణాలు, 108 మందికి రూ. 2.25 కోట్లు దీర్ఘకాలిక రుణాలు, 102 మందికి రూ.కోటి ఆరున్నర లక్షలు స్వల్పకాలిక రుణాలు అందించింది. దీంతో పాటు 2022-23 సంవత్సరంలో శనగలు, జొన్నలు, మక్కజొన్న కొనుగోళ్ల ద్వారా సొసైటీకి రూ.26 లక్షల ఆదాయం సమకూరింది. ఎరువులు, విత్తనాల విక్రయం ద్వారా సుమారు రూ.3 లక్షల వరకు ఆదాయం సమకూరగా పెట్రోల్ బంకు ద్వారా రూ.4 లక్షలు ఆదాయం సమకూరింది. రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నది. సహకార సంఘంలో 48 గ్రామాలకు చెందిన 4100 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరికి సంఘం ద్వారా ఎకరానికి 45 వేల వరకు రుణాన్ని అందిస్తున్నారు. దీంతో పాటు పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, పౌల్ట్రీ(కోళ్ల పెంపకం)ల్యాండ్ డెవలప్మెంట్, చిరు వ్యాపారాలు చేసుకునేందుకు 2022-23లో 210 మందికి రూ.3కోట్ల 75 లక్షల రుణాలను అందించారు.

**వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు..**

తెలంగాన ప్రభుత్వ సహకారంతో రైతులకు మద్దతు ధరతో రైతులు పండించిన మక్కజొన్న, జొన్న, శనగలను మార్క్‌ఫెడ్‌తో కలిసి కొనుగోలు చేసింది. సంఘానికి రూ.26 లక్షల కమిషన్ వచ్చింది. ఎరువులు, విత్తనాలు అమ్మకం, పల్సిలో ఉన్న పెట్రోల్ బంకు ద్వారా రూ.30 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. ఎరువులను మార్కెట్ కంటే తక్కువకు విక్రయిస్తున్నది.

**అన్నదాతకు అండగా ఉంటున్నాం..**



కుభీర్ సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, సోయా, శనగ విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నాం. కొరత రానీయకుండా జాగ్రత్త పడుతున్నాం. గృహ నిర్మాణం చేపట్టే వారికి రుణాలు అందిస్తున్నాం. కేంద్ర పభుత్వ నిర్వాకం వల్ల పెట్రోల్ బంకుకు పెద్దగా ఆదాయం లేకుండా పోయింది. త్వరలో దానిని సరళీకృతం చేస్తాం. రైతుల సహకారంతో భూమిని కొనుగోలు చేసి అన్ని వసతులతో కూడిన ఫంక్షన్‌హాలు నిర్మించాలని అనుకుంటున్నాం.

\- రేకుల గంగాచరణ్, ప్యాక్స్ చైర్మన్

**లాభాల బాటలో ముందుకెళ్తున్నది..**



సంఘం ద్వారా రైతులకు కావాల్సిన రుణాలు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నాం. దీని ద్వారా సంఘానికి ఆదాయం సమకూరుతున్నది. తక్కువ ధరలకు రైతులకు ఎరువులు విత్తనాలు అందుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత సంఘం మరింత బలోపేతమైంది. దీనికి చైర్మన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉత్పత్తులు కొనేటప్పుడు రాత్రింబవళ్లు సిబ్బంది కష్టపడడంతో సంఘం లాభాల బట పట్టింది. సభ్యులు తీసుకున్న రుణాలను చెల్లిస్తూ అండగా నిలుస్తున్నారు.

\- ఎగ్గం క్రాంతి కుమార్, సీఈవో పీఏసీఎస్


మౌనం పాటిస్తున్న పోలీసులు

# అమరవీరులకు ఘన నివాళి

భైంసా, అక్టోబర్ 21 : భైంసా పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సంలో భాగంగా అమరులైన పోలీసులకు సిబ్బంది నివాళులర్పించారు. వారి సేవలను గుర్తు చేశారు. పట్టణ సీఐ ఎల్. శీను, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# అమ్మ వారికి వెండి కిరీటం అందజేత

కుంటాల, అక్టోబర్, 21: గజ్జలమ్మ ఆలయ మూల విరాట్ అమ్మవారికి 16 తులాల వెండి కిరీటాన్ని రిటైర్డు ఉద్యోగి ఒడ్నం గజ్జారాం శనివారం దేవస్థానానికి అందజేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దాతను శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్ర పటాన్ని అందించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లమ్మల శంకర్, తాటి శివ, భుజంగం గణపతి, సోమశంకర్, తోట గోపి చంద్, తదితరులు పాల్గొన్నారు.


వెండి కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దాత ఒడ్నం గజ్జారాం

# బుద్ధుడి బోధనలే ఉన్నతమైన జీవనానికి మార్గం


పూజలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

భైంసా, అక్టోబర్ 21 : బుద్ధుడి బోధనలే ఉన్నతమైన జీవనానికి మార్గమని బుద్ధిష్టు సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షుడు ప్రసన్నజిత్ ఎంబ్లే పేర్కొన్నారు. భైంసాలోని రాహుల్‌నగర్‌లో గల బుద్ధవిహార్‌లో వర్షావాస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అనంతరం బుద్ధుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దిగంబర్, దీపక్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాతకు ప్రత్యేక పూజలు


అందకూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల, అక్టోబర్ 21 : దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల్లో దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. కల్లూర్‌లో ఓ దుర్గామాత మండపం వద్ద ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నదానం నిర్వహించారు.

# బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- బీఆర్‌ఎస్ నాయకులు
- బాసర, ముథోల్‌లో విస్తృతంగా ప్రచారం
- మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని సూచన


బాసర : ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బాసర, అక్టోబర్ 21 : బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని బాసర మండల బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సాలాపూర్, సవర్గావ్, సూరెల్లి, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మరోసారి ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నదని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో చేయని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమలు అమలు చేస్తున్నారని, సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోర్వ శ్యాం, సర్పంచ్‌ల సంఘం అధ్య క్షుడు సుధాకర్‌రెడ్డి, బాసర సర్పంచ్ లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, నాయకులు జ్ఞానీ పటేల్, ఆకాశ్, తదితరులు పాల్గొన్నారు.


ముథోల్ : ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**తరోడాలో..**

ముథోల్, అక్టోబర్ 21 : తరోడా గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ను మరోసారి ప్రజలు ఆదరిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఎవరో చెప్పిన మాటలు నమ్మి ప్రజలు మోస పోవద్దని సూచిం చారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు ఆరీఫ్, బాబన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.